సాక్షి వరంగల్

గురువారం । 5 । డిసెంబర్ । 2024



ఆటోకు ఆదరణ కరువు!

ఆటో డ్రైవర్ల జీవనం దయనీయంగా మారింది. 'మహాలక్ష్మి'తో తమకు గిరాకీ లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు.

- 8లో▸



విజయ డెయిరీలో చోరీ

హనుమకొండ అలంకార్ జంక్షన్ సమీపంలోని ప్రభుత్వ రంగ సంస్థ విజయ డెయిరీలో బుధవారం చోరీ జరిగింది.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
$30^0/23^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండ ఉంటుంది. సాయంత్రం చిరు జల్లులు పడే అవకాశం ఉంది. రాత్రి వేళ చలితోపాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఆశ వర్కర్లను కార్మికులుగా గుర్తించాలి



వరంగల్: రాష్ట్రంలోని ఆశ వర్కర్లను కార్మికులుగా గుర్తించి, నెలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని ఆశ వర్కర్ల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాసు మాధవి డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం కలెక్టరేట్ ఎదుట ఆశ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో ఆమె మాట్లాడారు. ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, లెప్రసీ, పల్స్‌పోలియో, టీబీ కార్యక్రమాలను విజయవంతం చేసిన ఆశ వర్కర్లకు పెండింగ్ పారితోషికాలు వెంటనే చెల్లించాలని కోరారు. 20 ఏళ్లుగా ఆశ వర్కర్ల సేవలను ప్రభుత్వాలు వినియోగించుకుంటున్నాయని, సామాజిక భద్రత కల్పిస్తూ పదవీ విరమణ పొందిన ఆశ వర్కర్లకు నెలకు రూ.10 వేల పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేశారు.

7 నుంచి సీఎం కప్ క్రీడలు

వరంగల్: జిల్లాలో ఈనెల 7 నుంచి సీఎం కప్–2024 పోటీలు ప్రారంభం అవుతాయని జిల్లా యువజన క్రీడల అధికారి సత్యవాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ స్థాయిలో 7, 8 తేదీలు, మండలస్థాయిలో 10, 11 తేదీలు, జిల్లాస్థాయిలో 16, 21 వరకు ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తమ పేర్లను cmcup2024.telangana.gov.inలో నమోదు చేసుకోవాలని కోరారు. మొబైల్ ఫోన్‌లో కూడా నమోదు చేసుకునే సౌకర్యం ఉందని, లింక్ ఈనెల 6వ తేదీ వరకే అందుబాటులో ఉంటుందని డీవైఎస్ఓ తెలిపారు.

'న్యాస్' పరీక్షకు 2,373 మంది హాజరు

కాశీబుగ్గ సెంటర్: జిల్లాలో బుధవారం నిర్వహించిన నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (న్యాస్) పరీక్షకు 2,373 మంది విద్యార్థులు హాజరయ్యారని డీఈఓ జ్ఞానేశ్వర్ తెలిపారు. 105 పాఠశాలల నుంచి 3, 6, 9 తరగతుల విద్యార్థులు హాజరుకాగా.. 353 మంది ఉపాధ్యాయులు పర్యవేక్షించారని ఆయన పేర్కొన్నారు.

మధ్యాహ్న భోజన బిల్లులు చెల్లించాలి



రాయపర్తి: అప్పులు తెచ్చి మధ్యాహ్న భోజనం వండి విద్యార్థుల కడుపు నింపినా ఏం మిగలడం లేదని మహిళా సంఘాల సభ్యులు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఎదుట మహిళా సంఘాల సభ్యులు ఉబ్బని ఐలమ్మ, బల్లెం సమ్మక్క, కారం ఎలేంద్ర, ఉబ్బని ఊర్మిళ, ఉపేంద్ర, కమటం పార్వతి, ఎల్లమ్మ, స్వరూప ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు మూడు మహిళా సంఘాల సభ్యులు భోజనం వండి పెడుతున్నట్లు తెలిపారు. ఆరు నెలలుగా బిల్లులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. తక్షణమే మధ్యాహ్న భోజన బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. మహిళా ఉపాధ్యాయులు ఓ కూలీతో మధ్యాహ్న భోజనం వండించి విద్యార్థులకు అందించారు. ఈ విషయమై ప్రధానోపాధ్యాయుడు సతీశ్‌కుమార్‌ను వివరణ కోరగా ప్రభుత్వం నుంచి వచ్చే బిల్లులు ఎప్పటికప్పుడు అందిస్తున్నాం. ప్రస్తుతం బిల్లులు రాకపోవడంతో మేం వారికి నచ్చజెప్పి వండిస్తున్నాం. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు.

విధుల్లో అలసత్వం వద్దు

వర్ధన్నపేట: గ్రామైక్య సంఘాల సహాయకులు వీఓ రికార్డుల నిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని డీఆర్‌డీఏ సెర్ప్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ దయాకర్ హెచ్చరించారు. వర్ధన్నపేటలో నిర్వహిస్తున్న అంతర్గత ఆడిట్ ప్రక్రియను బుధవారం దయాకర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరానికి జిల్లావ్యాప్తంగా ఆడిట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే లావాదేవీల రశీదులు, ఓచర్ సపోర్టు బిల్లులు, పలు రికార్డులు పరిశీలించినట్లు ఆయన పేర్కొన్నారు. ఆడిట్‌లో గుర్తించిన లోపాలపై జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులకు నివేదికలు అందజేస్తామని వివరించారు. ఏపీఎం వేణు, సీబీఓ ఆడిటర్ వెంకట్, సీసీలు గోలి కొమురయ్య, టి.రమేశ్, వీఓ ప్రతినిధులు భాను, స్వప్న, ఎలేంద్ర, రజిత, వీఓఏలు జ్యోతి, శోభ, స్రవంతి ఉన్నారు.

ఉలికిపాటు!

మేడారం అడవులు కేంద్రంగా భూ ప్రకంపనలు


- రిక్టర్ స్కేల్‌పై 5.3 మాగ్నిట్యూడ్‌గా నమోదు
- నిర్ధారించిన నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ
- ఉదయం 7.27నుంచి 7.29గంటల వరకు భూ అంతర్భాగంలో కదలికలు
- 3 నుంచి 5 సెకన్ల పాటు కంపించిన భూమి
- ఊగిన భవనాలు, పలుచోట్ల గోడలకు పగుళ్లు
- ఉరుకులు, పరుగులు పెట్టిన ఉమ్మడి జిల్లావాసులు



పర్వతగిరి :భయంతో బయటకు వచ్చిన టూక్యా తండావాసులు

ములుగు/ఏటూరునాగారం/ఎస్ఎస్ తాడ్వాయి/నెట్‌వర్క్:

ములుగు జిల్లా మేడారం కేంద్రంగా ఏర్పడిన భూ ప్రకంపనలు ఉమ్మడి జిల్లా ప్రజలను భయాందోళనకు గురిచేశాయి. భూమి కంపించిన సమయంలో కొన్నిచోట్ల వంట పాత్రలు కింద పడిపోగా.. ఇంటి తలుపులు తెరుచుకోవడం, సీలింగ్ ఫ్యాన్లు ఆటోమేటిక్‌గా ఊగడం, ముఖద్వారం గేటు సమీపంలో శబ్దాలు రావడంతో ఇళ్లలోనుంచి ఉరుకులు, పరుగులు పెట్టారు. అటవీ ప్రాంతాల దగ్గర ఉన్న గ్రామాల్లో సాధారణంగా కోతుల బెడద కారణంగా ఇంటి పైకప్పులు, కిటికీల శబ్దం అని మొదట అనుకున్నా అప్పటికే సోషల్ మీడియాలో భూ ప్రకంపనలు వార్తలు చూసిన ప్రజలు ఇళ్లనుంచి బయటికి పరుగులుతీశారు. కొంత మందికి ఏం జరుగుతుందో తెలియక అయోమయానికి గురయ్యారు.



రిక్టర్ స్కేల్‌పై 5.3గా నమోదు

ఎస్ఎస్ తాడ్వాయి మండల పరిధిలోని మేడారం సమీపంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో సుమారు 40కిలోమీటర్ల లోతు నుంచి భూమి కంపించినట్లుగా నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ(ఎన్‌సీఎస్) వెల్లడించింది. రిక్టర్ స్కేల్‌పై 5.3 మాగ్నిట్యూడ్‌గా నమోదైనట్లు నిర్ధారించింది. మేడారం సమీపంలోని ఉత్తరభాగం మీదుగా రెండు రాష్ట్రాల్లో భూ ప్రకంపనలు వ్యాపించాయి. ఉదయం 7.27నుంచి 7.29గంటల వరకు 3 నుంచి 5 సెకన్ల పాటు భూమి కంపించింది.

కంపించిన అమ్మవారి గద్దెలు



మేడారం సమ్మక్క–సారలమ్మ గద్దెలపై భక్తులు, పూజారులు ఉన్న క్రమంలో భూ ప్రకంపనలతో అమ్మవార్ల హుండీలు, పల్లెం, ఇతర సామగ్రి వైబ్రేట్ కావడం సీసీటీవీ పుటేజీల్లో క్షుణ్ణంగా నమోదైంది. ఏజెన్సీ ప్రాంతాల్లో కొంతమందికి విషయం తెలియకపోయినా సీసీ టీవీ పుటేజీల్లో రికార్డు అయిన దృశ్యాలను సోషల్ మీడియాలో వైరల్ చేయడంతో నిమిషాల వ్యవధిలో విషయం రాష్ట్ర రాజధాని వరకు చేరింది.

గోదావరి తీరంలో రెండో అతిపెద్ద భూకంపం?

గోదావరి పరీవాహక ప్రాంతంలోని భద్రాచలం సమీపంలో ఏప్రిల్ 13, 1969లో ఏర్పడిన భూకంపం రిక్టర్ స్కేల్‌పై 5.7 మాగ్నిట్యూడ్‌గా నమోదైంది. ఇది మొదటి అతిపెద్దది కాగా ములుగు జిల్లా పరీవాహక ప్రాంతంలో ఏర్పడిన 5.3 మాగ్నిట్యూడ్ రెండో అతిపెద్దదిగా భావిస్తున్నారు. 20 ఏళ్ల క్రితం ఆదిలాబాద్‌లో ప్రాంతంలో కేవలం 4మాగ్నిట్యూడ్‌గా నమోదైంది. ఈ భూకంపాలతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.



గోవిందరావుపేట మండలం మాన్యతండాలో కిందపడిన బోళ్లు



ఇసుక, బొగ్గు.. వేడినీళ్ల స్థావరాల్లోనే

ములుగు జిల్లాలోని రామన్నగూడెం ప్రాంతంలో వేడినీళ్ల స్థావరాలు ఎక్కువగా ఉన్నాయి. 1954లో అప్పటి ప్రభుత్వం చమురు నిక్షేపాల కోసం తవ్వకాలు జరిపి వదిలేసిన బోరులోనుంచి ఇప్పటికీ వేడినీళ్లు ధారాళంగా వస్తున్నాయి. వేడినీళ్లు ఉన్న ప్రాంతాల్లో భూ ప్రకంపనలు వస్తాయని జియాలజిస్ట్‌లు అభిప్రాయపడుతున్నారు. అదే విధంగా ఇసుక, బొగ్గు గనులు ఉన్న ప్రాంతాల్లో ఈ ప్రకంపనలు ఎక్కువగా వచ్చే అవకాశాలున్నాయని తెలిసింది.

చెట్లు కూలిపోవడానికి.. భూకంపానికి సంబంధం ఉందా?



ఆగస్టు 31న ఏటూరునాగారం అభయారణ్యం పరిధి మేడారం–ఎస్ఎస్ తాడ్వాయి, కొత్తూరు–దొడ్ల సమీపంలో 334 హెక్టార్లలో వీచిన రాకాసి గాలుల(టోర్నడో)తో వేలాది చెట్లు నేలకూలాయి. ఇంతలోనే ఇదే ప్రాంతంలో భూకంపం రావడంతో ముందు వచ్చే విపత్తులకు కేవలం హెచ్చరిక అని సీనియర్ శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. గడిచిన వేల సంవత్సరాలుగా గోదావరి పరీవాహక ప్రాంతాల్లో భూమి లోపలి పొరల్లో ఏర్పడుతూ వస్తున్న ఫాల్ట్‌లైన్ పూడ్చుకోవడానికి ఏర్పడ్డవే ఈ భూ ప్రకంపనలుగా భావిస్తున్నారు.

భయాందోళనకు గురైన ప్రజలు



- వాజేడు మండల పరిధి నాగారంలో మల్లెల దేవి ఇంటిపై నుంచి పెంకులు కిందపడ్డాయి. పేరూరులోని సీడ బ్ల్యూసీ కార్యాలయ భవనం గోడలకు 5 చోట్ల పగుళ్లు ఏర్పడ్డాయి. చీకుపల్లిలో ఓ ఇంటి గోడకు బీటలు వారడంతో పాటు గోడ పెచ్చులు ఊడిపడ్డాయి. మిర్చి తోటల్లో ఉన్న రైతుల ఎదురుగా రోడ్డుపై ఉన్న బైక్‌లు ఊగినట్లు కావడంతో తోటల్లో నుంచి బయటకు పరుగులు తీశారు.
- ఏటూరునాగారం మండలంలోని శంకరాజుపల్లికి చెందిన ఆత్కూరి నేతాజీ ఇంటిగోడ పడిపోయింది. అలాగే ఏటూరునాగారం 2వ వార్డులోని మాటూరి చంద్రకళ ఇంటి గోడలు కూలిపోయాయి.
- గోవిందరావుపేట మండల పరిధి రాంనగర్ మాన్యతండాలో భూమి కంపించడంతో ఇళ్లలోని వస్తువులు కిందపడ్డాయి. దీంతో ఇళ్ల నుంచి బయటకు వచ్చిన ప్రజలు చాలా సేపటివరకు ఇళ్లలోకి వెళ్లలేదు.
- మహబూబాబాద్ జిల్లా కేసముద్రంస్టేషన్‌లో రెండు ఇళ్లలో గోడలకు పగుళ్లు వచ్చాయి.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని ఆదర్శ కాలనీలో ఆత్మకూరి కుమార్‌యాదవ్ ఇంటి ఆవరణలో గల మరుగుదొడ్డి స్వల్పంగా ఒక పక్కకు కుంగిపోయింది.
- వరంగల్ నగరంలో భూమి కదిలినట్లు అనిపించడంతో భయాందోళనకు గురయ్యారు.
- జనగామ జిల్లాకేంద్రంలోని జీఎంఆర్ కాలనీలో గోడకు పగుళ్లు వచ్చాయి.

భూమి ఊగినట్లు అయ్యింది..



ఉదయం ఇంటి వద్ద మొఖం కడుగుతున్న సమయంలో భూమి ఊగినట్లు అయ్యింది. ఏం జరిగిందో అర్థం కాలేదు. కిందపడిపోతాను అన్నట్లుగా అనిపించింది. వెంటనే ఇంటి నుంచి బయటకు అందరం వచ్చాం.

- దేపాక సమ్మయ్య, మానసపల్లి, ఏటూరునాగారం

బొగ్గుగనుల ప్రాంతాల్లో ప్రకంపనలు



బొగ్గు, ఇసుక నిక్షేపాలు ఉన్న ప్రాంతాల్లో భూ ప్రకంపనలు వస్తుంటాయి. భూమి అడుగు భాగంలో వచ్చే మార్పుల వల్ల ఇలాంటివి సంభవిస్తాయి. భూమిపై ఒత్తిడి జరిగినప్పుడు ఇలాంటి ప్రకంపనలు వస్తాయి. మేడారంలో చెట్లు కూలిపోవడం, కొండాయిలో వరదలు రావడం, ఇప్పుడు భూమి కంపించడం ఇవన్నీ కూడా మానవ తప్పిదాలే. మనకు ఉన్న వనరులను కాపాడుకొని వాటికి ఒత్తిడి కలగకుండా, హాని చేయకుండా ఉంటేనే ఇలాంటి పెనుప్రమాదాలు రాకుండా ఉంటాయి. లేకుంటే మనం చేసే తప్పులే మానవ మనుగడకు ప్రశ్నార్థకమవుతాయి.

- ఆలం కిశోర్, జియాలజిస్ట్, ఐటీడీఏ, ఏటూరునాగారం

ఎవరో నెట్టినట్లు అనిపించింది



జియాలజిస్టుగా పనిచేసిన నాకు భూకంపాలు వస్తాయని తెలుసు. ఈ రోజు ప్రత్యక్షంగా చూసిన. ఉదయం యోగా క్లాస్ పూర్తయిన తర్వాత, మొదటి అంతస్తు వరండాలో ఫోన్ మాట్లాడుతూ నిలబడిన. 7.27 గంటల సమయంలో ఒక్క సారిగా వెనుక నుంచి ఎవరో నెట్టినట్లుగా అనిపించింది. బిల్డింగ్ రేలింగ్ సైతం ఊగింది. చాలా భయమేసింది.

- కాసోజు సతీశ్, జనగామ

పెద్ద శబ్దం వచ్చింది..



ధూపదీప నైవేద్యాల్లో భాగంగా దుగ్గొండి మండలం నాచినపల్లి రామాలయంలో ఉదయం పూజలు చేస్తుండగా భూమి ఒక్కసారిగా కంపించింది. ఆలయంలోని బీరువా కదలడంతో పెద్ద శబ్దం వచ్చింది. దీంతో ఏం జరుగుతుందోనని భయంతో బయటకు పరుగులు తీశాను. సెకన్ల సమయంలోనే అంతా జరిగిపోయింది.

- యెదుగూరి రమేశ్‌మూర్తి

కేంద్ర బృందం పర్యటనకు లైజన్ ఆఫీసర్లు

- అధికారుల సమీక్షలో కలెక్టర్ సత్య శారద

వరంగల్: విపత్తు అనంతరం అవసరాల అంచనా (పోస్ట్ డిజాస్టర్ నీడ్స్ అసెస్‌మెంట్స్) కోసం జిల్లా పర్యటనకు వచ్చిన 30 మంది అధికారుల బృందానికి లైజన్ ఆఫీసర్లను నియమించినట్లు కలెక్టర్ సత్య శారద తెలిపారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో బుధవారం నిర్వహించిన అధికారుల సమీక్షలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో గురువారం నుంచి కేంద్ర బృందం పర్యటిస్తుందని తెలిపారు. ఆరు బృందాలుగా విభజించి ఒక్కో బృందానికి ఒక తహసీల్దార్, ఎంపీడీఓను లైజన్ ఆఫీసర్లుగా నియమించినట్లు పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్వో విజయలక్ష్మి, వరంగల్, నర్సంపేట ఆర్డీఓలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, జిల్లాలోని తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నేడు ఎంజీఎంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం

వరంగల్: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను గురువారం ప్రారంభిస్తారని కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం అధికారులతో నిర్వహించిన విజయోత్సవాల సమీక్షలో ఆమె మాట్లాడారు. ఎంజీఎంలో ఓపీ కౌంటర్లను 4 నుంచి 6కు, ఫార్మసీ కౌంటర్లను 6 నుంచి 10కి పెంచినట్లు తెలిపారు. దివ్యాంగులు, మహిళల ఓపీ సెంటర్లను ఆధునీకరించి మంత్రితో ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఎంజీఎం పరిసరాల్లో మొక్కలు నాటే కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, డీఆర్వో విజయలక్ష్మి, వరంగల్ ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, నర్సంపేట ఆర్డీఓ ఉమారాణి, డీఆర్డీఓ కౌసల్యాదేవి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి పాల్గొన్నారు.




సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారద

రైతులతో కలెక్టర్ భేటీ

జాతీయ రహదారి నిర్మాణ పనులపై పర్వతగిరి మండలం ఏనుగల్, గీసుకొండ గ్రామాల రైతులతో కలెక్టర్ డాక్టర్ సత్య శారద కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా సేకరించిన రైతుల భూములకు ప్రభుత్వం నిర్ణయించిన ధర సంతృప్తిగా లేకుంటే ఆర్బిట్రేషన్ ఫైల్ చేసి పెంచిన ధర చెల్లించే అవకాశం ఉంటుందని తెలిపారు. అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, గీసుకొండ, పర్వతగిరి తహసీల్దార్లు, రైతులు పాల్గొన్నారు.

● భళా.. బాతుల వరుస!



మండల కేంద్రంలో బుధవారం బాతులు సందడి చేశాయి. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా కావలికి చెందిన రైతు నాగరాజు రూ.లక్షన్నరతో చెన్నై, పశ్చిమ గోదావరి జిల్లాలో బాతు పిల్లలను కొనుగోలు చేశాడు. తెలంగాణలోని పలు ప్రాంతాల మీదుగా బాతులతో రాయపర్తికి వచ్చాడు. మూడు నెలల్లో వాటిని పెంచి రూ.3లక్షలకు విక్రయించుకుని వెళ్తానని ఆయన చెప్పాడు. వరికోతలు కాగానే గ్రామాల్లోని చెరువులను ఆవాసంగా ఏర్పరచుకొని బాతులను పెంచుతానని పేర్కొన్నాడు. - రాయపర్తి

ఓపీ సేవలు మెరుగు

ఎంజీఎంలో నూతనంగా కంప్యూటర్ కౌంటర్లు

- ఔషధాల పంపిణీకి 10 ఫార్మసీ కౌంటర్లు
- రిపీట్ ఓపీ కోసం ఆస్పత్రిలో ప్రత్యేక గది ఏర్పాటు
- నేడు ప్రారంభించనున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు



వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో ఓపీ చిట్టీలు ఇచ్చే నూతన కౌంటర్లు

ఎంజీఎం: ఎంజీఎం ఆస్పత్రికి వచ్చే వేలాది మంది రోగులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు పరిపాలనాధికారులు, కలెక్టర్ ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. ఆస్పత్రిని దశల వారీగా అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ రూపొందించారు. మొదటి దశలో మెరుగైన ఓపీ సేవల కోసం నూతన కంప్యూటర్ కౌంటర్లు, ఫార్మసీ కౌంటర్లు పెంచారు. రోగుల కోసం ప్రతి ఓపీ గది వద్ద కుర్చీలు వేయించారు. అంతేకాకుండా రిపీట్ ఓపీ కోసం ఓపీ షెడ్డులో ప్రత్యేక గదిని అందుబాటులోకి తెచ్చారు. దీంతో రోగుల సహాయకులు సేద తీరేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఓపీ కౌంటర్ల వద్ద తగ్గనున్న రద్దీ..

ప్రస్తుతం ఎంజీఎం ఆస్పత్రిలో ఓపీ గదుల వద్దనే కంప్యూటర్ కౌంటర్లను ఏర్పాటు చేయడంతో రద్దీ ఏర్పడి రోగులు వైద్యసేవలు పొందేందుకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. పరిస్థితిని గమనించిన కలెక్టర్.. ఎంజీఎం పరిపాలనాధికారులతో చర్చలు జరిపి ఓపీ ఎదుట ఉన్న షెడ్డులో పాత కంప్యూటర్ కౌంటర్లను మరమ్మతులు చేయించారు. రోగులకు నూతన కౌంటర్ల ద్వారా ఓపీ స్లిప్పులను ఇచ్చేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. నూతన కౌంటర్లు అందుబాటులోకి వస్తే ఓపీ వద్ద రద్దీ తగ్గి రోగులకు మెరుగైన సేవలు అందనున్నాయి.

10 ఫార్మసీ కౌంటర్లు..

ఆస్పత్రిలో ప్రతిరోజూ ఓపీ విభాగంలో సుమారు 3 వేల మంది వైద్య సేవలు పొందుతారు. వీరందరికి కొన్నేళ్లుగా నాలుగు కౌంటర్ల ద్వారా మాత్రమే ఔషధాలు పంపిణీ చేసేవారు. వైద్యుడి వద్ద చికిత్స పొందడం ఒక్క ఎత్తయితే.. ఫార్మసీ కౌంటర్‌లో మందులు పొందడం కోసం కుస్తీ పట్టాల్సిన పరిస్థితి ఏర్పడేది. ఒక్కో కౌంటర్ వద్ద ఒక్కో ఫార్మసిస్టు సుమారు 500 మంది రోగులకు మందులు ఇవ్వాల్సిన పరిస్థితి ఉండేది. దీంతో రోగులు గంటల కొద్ది సమయం వేచి చూసేవారు. ప్రస్తుతం కౌంటర్ల సంఖ్యను 10కి పెంచారు. ఇప్పుడు ఒక్కో కౌంటర్‌లో 250 మంది రోగులకు మందులు అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. రోగులు గంటల తరబడి వేచి ఉండాల్సిన అవసరం ఉండదు. త్వరగా వైద్యసేవలు పొందే అవకాశం ఉంటుంది.

నేడు ప్రారంభం..

ఓపీ రోగుల కోసం ఏర్పాటు చేసిన నూతన కంప్యూటర్ కౌంటర్లు, ఫార్మసీ కౌంటర్లను కలెక్టర్, స్థానిక ప్రజాప్రతినిధులు గురువారం ప్రారంభించనునట్లు ఎంజీఎం పరిపాలనాధికారులు తెలిపారు. నూతన కౌంటర్లు అందుబాటులోకి వస్తే రోగులకు మెరుగైన సేవలు అందనున్నట్లు వారు పేర్కొన్నారు.

పెరటి కోళ్లతో ఆదాయం



పెరటి కోళ్లను అందజేస్తున్న శాస్త్రవేత్తలు, డాక్టర్లు

పర్వతగిరి: పెరటి కోళ్లతో అదనపు ఆదాయం వస్తుందని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ శశాంక్, డాక్టర్ సాయికిరణ్ అన్నారు. పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో కమ్మలకుంటతండా గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న 70 మంది రైతులకు బుధవారం ఆరు వారాల రాజశ్రీ కోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి ఆవరణలో పెంచుకోవడానికి పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం అధికారులు రాజశ్రీ కోళ్లను రూపొందించారని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అధిక ఆదాయాన్ని సమకూర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి రాజు, డాక్టర్ గణేశ్, మండల రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి

- ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

చెన్నారావుపేట: విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మండలంలోని అమీనాబాద్ మోడల్ స్కూల్‌ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను ప్రిన్సిపాల్ జ్యోతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారంగా భోజనం అందించాలని, విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు. డైనింగ్ హాల్ నిర్మాణం కోసం అధికారులతో చర్చించారు. ఆర్అండ్‌బీ డీఈఈ కిరణ్, శ్రీధర్ కాంగ్రెస్ మండల అధ్యక్షులడు భూక్యా గోపాల్‌నాయక్, జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దన రమేశ్, మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు బండి హరీశ్ తదితరులు ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దొంతి

పెద్దపల్లికి తరలిన గ్రూప్–4 అభ్యర్థులు

వరంగల్: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం పెద్దపల్లిలో నిర్వహించిన యువ వికాసం సదస్సుకు వెళ్లిన బస్సులను జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి కలెక్టరేట్ వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా నుంచి గ్రూప్–4లో ఎంపికైన 149 మంది అభ్యర్థులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రాలను పెద్దపల్లిలో స్వీకరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో విజయలక్ష్మి, ఏఓ శ్రీకాంత్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

తుంగబంధం కాల్వలోకి మొసలి


కాల్వ నుంచి ఒడ్డుపైకి చేరిన మొసలి

ఖానాపురం : మండలంలోని కొత్తూరు శివారులో కాల్వలోకి మొసలి వచ్చింది. పాకాల ఆయకట్టు పరిధిలోని తుంగబంధం కాల్వలోకి మొసలి రావడంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. కాల్వ నుంచి సమీపంలోని బావిలోకి వెళ్లింది. కాగా, తాము నిత్యం పంటపొలాలకు వెళ్తుంటామని, అధికారులు స్పందించి వెంటనే మొసలిని పట్టుకుని పాకాల సరస్సులో వదిలేయాలని పలువురు అన్నదాతలు కోరుతున్నారు.

ప్రాజెక్టులు సేఫ్!

కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలో భూమి రెండు సెకన్ల పాటు కంపించింది. బుధవారం ఉదయం 7.27గంటలకు ఒక్కసారిగా ఊగిపోయింది. మండలంలో నిర్మించిన అన్నారం(సరస్వతి), మేడిగడ్డ(లక్ష్మి) బరాజ్‌లతో పాటు కన్నెపల్లిలోని లక్ష్మీపంపుహౌస్, బీరాసాగర్ వద్ద నిర్మిస్తున్న చిన్న కాళేశ్వరంకు ఎలాంటి ముప్పువాటిల్లలేదని ఇంజనీర్లు పేర్కొన్నారు. భూమి కంపించిన తరువాత ఆయా బరాజ్‌లు, పంపుహౌస్ ప్రాంతాల్లో ఇరిగేషన్ ఇంజనీర్లు పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


సమ్మయ్య మృతదేహం

కొత్తగూడ: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం మండలంలోని ఎంచగూడెం క్రాస్ వద్ద జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని సాదిరెడ్డిపల్లికి చెందిన జిట్టబోయిన సమ్మయ్య(45) పని నిమిత్తం బైక్‌పై ఎంచగూడెం వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో రైస్‌మిల్లు సమీపంలో బైక్ అదుపు తప్పి కింద పడడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య అలియ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం తరలించినట్లు ఎస్సై కుశకుమార్ తెలిపారు.

భద్రకాళి ఆలయ హుండీ లెక్కింపు



హన్మకొండ కల్చరల్: భద్రకాళి ఆలయంలో బుధవారం హుండీ లెక్కించారు. ఆలయ ఈఓ శేషుభారతి ఆధ్వర్యంలో దేవాలయ అర్చకులు భద్రకాళి శేషు ఆలయ సిబ్బందితో పాటు శ్రీలక్ష్మీ వేంకటేశ్వర సేవా సమితి భక్తులు పాల్గొన్నారు. లెక్కింపులో రూ.79,36,043 (రెండు నెలల 10 రోజుల వ్యవధికి సంబంధించి) ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. 326 యూఎస్ డాలర్లు, 20 కెనడా డాలర్లు, 10 యూఏఈ దిరమ్స్, 25 ఇంగ్లండ్ పౌండ్స్, 5 ఆస్ట్రేలియన్, 10 సింగపూర్ డాలర్లు లభించినట్లు, వీటిని యూనియన్ బ్యాంకులో జమ చేసినట్లు ఈఓ శేషుభారతి తెలిపారు. పర్యవేక్షణాధికారిగా దేవాదాయ శాఖ పరిశీలకులు అనిల్‌కుమార్ వ్యవహరించారు.

ఆటోకు ఆదరణ కరువు!

ఉచిత బస్సు సౌకర్యంతో కుదేలైన ఉపాధి
- గిరాకీ లేక వృత్తికి దూరమైన డ్రైవర్లు
- ఆందోళన బాట.. హైదరాబాద్‌లో బహిరంగ సభకు సన్నద్ధం
- 7న రాష్ట్ర వ్యాప్త ఆటోల బంద్‌కు జేఏసీ పిలుపు
- ఆటోడ్రైవర్ల సమస్యలు పరిష్కారమయ్యేనా?


నగరంలో ఆటోలు

ఖిలా వరంగల్ : ప్రయాణికులు ఆదరిస్తేనే ఆ రోజు ఎంతోకొంత ఆదాయం. లేదంటే ఖాళీ జేబులతో ఇంటి బాట పట్టాల్సిందే. రోజువారీ చిట్టీలు, నెలవారీ కిస్తీలు..పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ ఇంధనం.. ఇలా ప్రతిది ఖర్చుతో కూడుకున్నదే. అయినా ఆర్టీసీ బస్సులు నడిచే, నడవని మార్గాల్లో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తూ ఆటో డ్రైవర్లు ఉన్నంతలో తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. ఫలితంగా మహిళలు బస్సులను ఆశ్రయించడంతో ఆటోలకు గిరాకీ తగ్గింది. ఆటోల కిరాయి, ఇంధన ఖర్చులు పోగా ఆదాయం ఏమాత్రం మిగలడం లేదని డ్రైవర్లు వాపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమకు ప్రత్యామ్నాయ మార్గం చూపించాలని కోరుతున్నారు.

హామీలు అమలయ్యేనా?

తాము అధికారంలోకి రాగానే ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ఏడాదికి రూ. 12వేలు అందజేసి అందుకుంటామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని పేర్కొంది. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకుంటున్నా ఆటో డ్రైవర్ల హామీ నెరవేరలేదు. అంతే కాదు డ్రైవర్ల జీవనోపాధి దెబ్బతినడం సుమారు 70 మందికి పైగా ఆత్మహత్యలకు పాల్పడ్డారు. సుమారు 5వే మంది ఉపాధికి దూరమయ్యారని డ్రైవర్ల జేఏసీ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రంలో 7న ఆటోలు బంద్..

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 7న తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్ల సంఘాల జేఏసీ 13 డిమాండ్లతో బంద్‌కు పిలుపునిచ్చింది. ఆ డిమాండ్లు ఇలా ఉన్నాయి. ఫ్రీ బస్సుతో నష్టపోయిన ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి. ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ఏడాదికి రూ.15వేలు ఇవ్వాలి. ఆటో, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి. గ్రేటర్ నగరాల్లో ఎల్‌పీజీ, సీఎన్‌జీ, ఎలక్ట్రికల్ కొత్త ఆటోలకు అనుమతులు ఇవ్వాలి. ఓలా, ఉబర్, రాపిడో ద్వారా అక్రమంగా నడుస్తున్న టూవీలర్లను నిషేధించాలి. ఆటో మీటర్ చార్జీలు పెంచాలి. థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్ రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలి. యాక్సిడెంట్ బీమాను రూ.10లక్షలకు పెంచాలి. సాధారణ మరణాలకు వర్తింప చేయాలి. యాభై ఏళ్లు నిండిన ప్రతీ ఆటో డ్రైవర్‌కు వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలి. కేంద్రం తెచ్చిన 2019 మోటారు వాహనాల చట్టాన్ని రద్దు చేయాలి. ప్రైవేట్ ఫైనాన్షియర్ల దోపిడీ అరికట్టాలి. ఆటోలకు పార్కింగ్ స్థలాలు కేటాయించాలి. ఇలా 13 డిమాండ్లతో ఆటోలు బంద్ చేసి చలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలిపునిచ్చింది. హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద ఆటో డ్రైవర్ల ర్యాలీ ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు జేఏసీ పేర్కొంది.

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి



మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం లేనప్పుడు అన్ని ఖర్చులు పోనూ రోజు రూ.700 వరకు మిగిలేది. ప్రస్తుతం గిరాకీ లేకపోవడంతో చాలా మంది వృత్తికే దూరమయ్యారు. రాష్ట్రంలో 7వేల మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ప్రభుత్వం తన హామీ మేరకు ఆటో డ్రైవర్లకు నెలకు రూ. 12వేల ఆర్థిక సాయం అందజేయాలి. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి.

-ఈసంపెల్లి సంజీవ,
ఆటో డ్రైవర్స్ జేఏసీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు

డ్రైవర్లకు రూ.12వేల సాయం అందించాలి



ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఆటో డ్రైవర్లకు నెలకు రూ.12వేల ఆర్థిక సాయం అందించాలి. ఉదయం నుంచి సాయంత్రం కష్టపడినా కనీసం రూ.300 సంపాదించలేకపోతున్నాం. ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 7న ఆటోల బంద్‌కు పిలుపునిచ్చాం.హైదరాబాద్‌లో నిర్వహించే సభకు ఆటో డ్రైవర్లు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలి.

-మంద శ్రీధర్‌రెడ్డి,
ఆటో యూనియన్ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



డ్రైవర్ల జీవనం.. దయనీయం

ఉమ్మడి వరంగల్ జిలాల్లో పలు మార్గాల్లో గత ఏడాది వరకు బస్సులతోపాటు ఆటోలు పోటీగా నడిచేవి. అనేక మంది నిరుద్యోగ యువత ఆటో డ్రైవింగ్ వృత్తి పై ఆధారపడి జీవనం సాగించేవారు. ఈ క్రమంలో ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో గిరాకీలేక ఆటో డ్రైవర్ల జీవనం దయనీయంగా మారింది. వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 45 వేలకు పైగా ఆటోలు ఉన్నాయి. ఇందులో ట్రైసిటీలో 12వేల ఆటోలు నడుస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో మహిళా ప్రయాణికులు ఆటోను ఆశ్రయించడం లేదు. ఫలితంగా గిరాకీ లేక ఆటోడ్రైవర్లు ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ట్రైసిటీలో వరంగల్ నుంచి కాజీపేట వరకు వేలాదిగా నడిచే ఆటోలు ప్రస్తుతం సరైన గిరాకీ లేకపోవడంతో డ్రైవర్లు వృత్తికి దూరమవుతున్నారు. ఇతర గ్రామాల్లో సైతం ఆటో డ్రైవర్లకు తిప్పలు తప్పడం లేదు. ఏజెన్సీ ప్రాంతాల్లో, బస్సులు నడవని మార్గాల్లో మాత్రం కొద్దిగా మెరుగు ఉంది. ట్రైసిటీతోపాటు జిల్లా కేంద్రాల్లో ఆటో డ్రైవర్లకు ఆర్థిక కష్టాలు వెంటాడుతున్నాయి. ఆటో డ్రైవింగ్ వృత్తిని నమ్ముకున్న వారి సంఖ్య పడిపోయింది. ఇతర పనులకు వెళ్తుండడంతో ఆటోల సంఖ్య తగ్గిందని చెబుతున్నారు.

ఇంటర్‌వర్సిటీ చెస్ పోటీలకు కేయూ మహిళా జట్టు


కేయూ చెస్‌జట్టుతో స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ వెంకయ్య

కేయూ క్యాంపస్: ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలోని గీతం యూనివర్సిటీలో ఈ నెల 7వ తేదీవరకు జరగనున్న సౌత్‌వెస్ట్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ చెస్ మహిళా పోటీలకు కాకతీయ యూనివర్సిటీ జట్టును ఎంపిక చేసినట్లు స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ వై. వెంకయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే వారిలో బి. నవ్య, ఎస్. స్నేహిత (హనుమకొండ కిట్స్‌కాలేజీ), బి. దేవిక (వరంగల్ ఎల్‌బీ కాలేజీ), టి. మాధుర్య (కేయూ ఇంజనీరింగ్ కాలేజీ కో–ఎడ్యుకేషన్), కె. శ్రావిక (టీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ ఖమ్మం), కె. భార్గవి (టీఎస్‌డబ్ల్యూ ఆర్‌డీసీ ఖమ్మం) ఉన్నారు. వీరికి కొత్తగూడెం టీఎస్‌డబ్ల్యూ ఆర్‌డీసీ గర్ల్స్ వ్యాయామ అధ్యాపకురాలు డి. శ్వేత మేనేజర్‌గా వ్యవహరిస్తారని వెంకయ్య తెలిపారు. కాగా, ఈ పోటీలు ఈనెల 4న ప్రారంభమయ్యాయి.

కిషోర్ మృతదేహం అప్పగింత


కిశోర్ మృతదేహం అప్పగిస్తున్న పోలీసులు

ఏటూరునాగారం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా గంగులూరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాంపేడ్ గ్రామానికి చెందిన మావోయిస్టు కిషోర్ ఇటీవల జరిగిన చెల్పాక ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన విషయం తెలిసిందే. బుధవారం కన్నాయిగూడెం తహసీల్దార్ వేణుగోపాల్ సమక్షంలో కిషోర్ మృతదేహాన్ని అతని సోదరుడు పూనేష్‌కుమార్‌కు సీఐ శ్రీనివాస్, ఎస్సై తాజొద్దీన్‌లు అప్పగించారు. ఆదివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మృతి చెందగా అందులో ఏగోలపు మల్లయ్య అలియాస్ మధు కేసు హైకోర్టులో ఉండగా దానిని పోస్టుమార్టం గదిలోనే భద్రపర్చారు. మిగతా నలుగురు మావోయిస్టులు భద్రు, జమున, కామేశ్, కరుణాకర్‌ల మృతదేహాలను మంగళవారం వారి కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. ఇక మల్లయ్య కేసు నేడు విచారణ కొనసాగనుంది. జైసింగ్ మృతదేహం కోసం కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినప్పటికీ ఎవరూ రాలేదని పోలీసులు తెలిపారు.

విజయ డెయిరీలో చోరీ

- ఇంటి దొంగలపై అనుమానాలు?
- ఆధారాలు సేకరించిన క్లూస్‌టీం


డెయిరీ జూనియర్ మేనేజర్ గదిలో చిందరవందరగా పడి ఉన్న ఫైళ్లు

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ అలంకార్ జంక్షన్ సమీపంలోని ప్రభుత్వ రంగ సంస్థ విజయ డెయిరీలో బుధవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ చాంబర్, డెయిరీ మేనేజర్, మరో అధికారి గదుల్లో చొరబడిన దొంగ.. బీరువాలు తెరిచి రికార్డులు చిందరవందరగా పడేసి వెళ్లిపోయాడు. సమాచారం అందుకున్న సీసీఎస్ పోలీసులు డెయిరీ పరిసరాలను పరిశీలించి ప్రాథమిక ఆధారాలు సేకరించారు. డెయిరీ మేనేజర్ ప్రదీప్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న హనుమకొండ పోలీసులు విచారణ చేపడుతున్నారు. డెయిరీ సిబ్బంది కథనం ప్రకారం, సీసీ ఫుటేజీ ఆధారంగా తెలిసిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం తెల్లవారుజామున ఓ వ్యక్తి తాళం పగులగొట్టి జూనియర్ మేనేజర్ గదిలోకి చొరబడి అందులోని బీరువా తెరిచి ఫైళ్లు వెతికాడు. అనంతరం డెయిరీ మేనేజర్ గదిలోని బీరువానూ చిందరవందరగా చేశాడు. ఇక్కడి టేబుల్ లోపల ఉన్న చిల్లర నగదు తీసుకున్నాడు. అనంతరం డిప్యూటీ డైరెక్టర్ గదిలోకి వెళ్లి ఫైళ్లు చిందరవందరగా పడేశాడు. దొంగకు నగదు లభించకపోవడం.. ఫైళ్లు మాత్రం అక్కడే వదిలేసి వెళ్లడం పలు అనుమానాలకు తావిస్తోంది. దీంతో ఇదీ ఇంటి దొంగల పనా లేదా బయటి వ్యక్తులు చేసిన పనా అని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. 24 గంటలపాటు వాహనాలు, సిబ్బంది ఉండే డెయిరీలో దొంగ చొరబడడం ఆరు దశాబ్దాల సంస్థ చరిత్రలో ఇదే ప్రథమంగా పేర్కొన్నారు. డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ శ్రవణ్‌కుమార్ సోమవారం నుంచి సెలవులో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై ఆయనను వివరణ కోరగా చోరీ జరిగిన విషయం తెలిసిందన్నారు.

కాజీపేట జంక్షన్‌లో రైల్వే ఎన్నికలు..

- పోలీస్ బందోబస్తు మధ్య ప్రారంభం
- 5 పోలింగ్ సెంటర్లలో ఓటు వేసిన కార్మికులు
- 50.51 శాతం పోలింగ్ నమోదు


ఎన్నికల ప్రచార శిబిరాల వద్ద రైల్వే నాయకులు, కార్మికులు

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్‌లో మూడు రోజుల పాటు జరిగే రైల్వే వన్ ఇండస్ట్రీ వన్ యూనియన్ ఎన్నికలు పోలీస్ బందోబస్తు మధ్య బుధవారం ప్రారంభమయ్యాయి. రైల్వేలో గుర్తింపు సంఘం కోసం బుధ, గురు, శుక్రవారాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు కాజీపేట జంక్షన్‌లో ఎలక్ట్రిక్‌లోకోషెడ్, డీజిల్‌లోకోషెడ్, రైల్వే డివిజనల్ ట్రైనింగ్ సెంటర్, రైల్వే సివిల్ ట్రైనింగ్ సెంటర్లో ఏర్పాటు చేసిన 5 పోలింగ్ సెంటర్లలో ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రైల్వే కార్మికులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రైల్వే ఎన్నికల సందర్భంగా జంక్షన్, కాలనీల్లో సందడి నెలకొంది. కాజీపేట జంక్షన్‌లో మొత్తం 50.51 శాతం పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ డిప్యూటీ డివిజనల్ సెక్రటరీ చింత మురళి, రైల్వే మజ్దూర్ యూనియన్ కాజీపేట కో–ఆర్డినేటర్ నాయిని సదానందం, డీఎంఆర్‌కెఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.మోతీలాల్ తెలిపారు.

పోలింగ్ వివరాలు..

డీజిల్‌లోకోషెడ్ (పోలింగ్ కేంద్రం–13) మొత్తం ఓట్లు 680 . ఇందులో 340 ఓట్లు పోలు కాగా ఇంకా 340 పోల్ కావాల్సి ఉంది. ఎలక్ట్రికల్‌లోకోషెడ్ (పోలింగ్ కేంద్రం–14)లో మొత్తం ఓట్లు 428 . ఇందులో పోలైన ఓట్లు 234 కాగా 194 పోలు కావాల్సి ఉంది. రైల్వే ట్రైనింగ్ స్కూల్ సెంటర్ (పోలింగ్ కేంద్రం–37)లో మొత్తం ఓట్లు 848. ఇందులో 347 ఓట్లు పోలుకాగా 501 పోల్ కావాల్సి ఉంది. రైల్వే డివిజనల్ ట్రైనింగ్ సెంటర్ (పోలింగ్ కేంద్రం –11)లో ఓట్లు మొత్తం 702. ఇందులో 420 పోలుకాగా 280 పోల్ కావాల్సి ఉంది. డివిజనల్ ట్రైనింగ్ సెంటర్ (పోలింగ్ కేంద్రం–12)లో మొత్తం ఓట్లు 816. ఇందులో 411 ఓట్లు పోలుకాగా 405 పోల్ కావాల్సి ఉంది.

ప్రయాణికులకు ఊరట

పలు రైళ్లకు జనరల్ బోగీల ఏర్పాటు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ మీదుగా వివిధ రూట్లలో ప్రయాణించే పలు రైళ్లకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రయాణికుల సౌకర్యార్థం అత్యాధునిక సౌకర్యాలతో లింకే–హఫ్‌మన్–బుష్ (ఎల్‌హెచ్‌బీ) కోచ్‌లతో కూడిన జనరల్ కోచ్‌లను జత చేసి నడిపిస్తున్నట్లు బుధవారం రైల్వే అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో ప్రయాణించే రైళ్లకు రెండు జనరల్ కోచ్‌లు ఉండగా.. ఇప్పుడు కొత్తగా ప్రతీ రైలుకు మరో రెండు జనరల్ కోచ్‌లను జత చేసినట్లు తెలిపారు. దశలవారీగా మొత్తం నాలుగు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో రైళ్లు నడిపిస్తున్నట్లు తెలిపారు. జనరల్ కోచ్‌లలో ప్రయాణికుల రద్దీ ఫిర్యాదుల మేరకు రైల్వే బోర్డు ఈ నిర్ణయం తీసుకుని జనరల్ కోచ్‌లను దశల వారీగా ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. నిల్చోడానికి స్థలం లేని విధంగా జనరల్ కోచ్‌లో ప్రయాణించే సాధారణ ప్రయాణికులకు, సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు రైల్వేశాఖ జనరల్ బోగీలు పెంచి ఊరట కల్పించింది. కాజీపేట మీదుగా ప్రయాణించే ఇంటర్‌సిటీ, దక్షిణ్, కాగజ్‌నగర్, దానాపూర్, గూడూరు, గోల్కొండ, సాయినగర్, పద్మావతి తదితర రైళ్లకు ఎల్‌హెచ్‌బీ జనరల్ క్లాస్ కోచ్‌లను ప్రవేశపెట్టి నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

మహిళలను కొట్టిన ఘటనలో ఆరుగురిపై కేసు

ఖిలా వరంగల్: భూమి పంపకాల విషయంలో తల్లీబిడ్డలను కొట్టిన ఘటనలో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు. ఖిలా వరంగల్ తూర్పుకోటకు చెందిన తల్లీబిడ్డలు కొడారి రజిత, లక్ష్మిని గాడిపెల్లికి చెందిన కాశబోయిన అనిల్, యాదనాల అమని, యాదనాల రజిత, బట్ట మేకల రజిత, బట్టమేకల రాజు, బట్ట మేకల ఐలయ్య కొట్టారు. లక్ష్మి ఇంట్లో ప్రవేశించి ఆమెతో పాటు తన కుమార్తె రజితను కొట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

పాత గొడవల కారణంగా దాడి..ఇద్దరిపై కేసు

భూమి పంపకాలు, పాత గొడవల కారణంగా వరంగల్ రాంకీ కాలనీకి చెందిన బూర యాతిష్‌కుమార్ ద్విచక్రవాహనంపై వెళ్తుండగా శ్రీధర్, శ్రీనివాస్ అనే వ్యక్తులు కారు అడ్డుపెట్టి అతన్ని కారులో ఎక్కించుకుని తిప్పుకుంటూ కొట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆ ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు.


టీచర్ ఎమ్మెల్సీ ఓటరు దరఖాస్తుల తిరస్కరణ

- హనుమకొండ డివిజన్‌లో 1060..
- దరఖాస్తులకు మరోసారి అవకాశం
- ఈనెల 9నుంచి ఆన్‌లైన్‌లో చేసుకోవచ్చు



విద్యారణ్యపురి : హనుమకొండ డివిజన్ పరిధిలో ఉమ్మడి వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్ని కల కోసం ఉపాధ్యాయులు ఓటరుగా దరఖాస్తులు చేసుకోగా వివిధ కారణాలతో 1060 దరఖాస్తులు తిరస్కరించారని హనుమకొండ రెవెన్యూ డివిజనల్ అధికారి, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటరు నమోదుకు ఈఏడాది అక్టోబర్ 16 నుంచి నవంబర్ 6వతేదీ వరకు ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. హనుమకొండ డివిజన్ పరిధిలో మొత్తం 5,574 దరఖాస్తులు రాగా అందులో విచారణ అనంతరం 4,514 దరఖాస్తులు అంగీకరించారని తెలిపారు. వివిధ కారణాలతో 1060 దరఖాస్తులు తిరస్కరించారని పేర్కొన్నారు. తిరస్కరణకు కారణాలు ఇవి. కటాఫ్ తేదీ తరువాత ఉత్తీర్ణులై ఉండడం, దరఖాస్తులో వివరాలు సరిగా లేకపోవడం, ఫొటో సరిగాలేకపోవడం, నోటిఫైడ్ ఆఫీస్రత అధికారి కౌంటర్ సంతకం లేకపోవడం, దరఖాస్తుల వెంట సంబంధిత మెమో, ప్రొవిజనల్ సర్టిఫికెట్ లేకపోవడం, దరఖాస్తుపై అర్జీదారుడి సంతకం లేకపోవడం లాంటి కారణాలు ఉన్నాయి. ఎవరివైతే దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయో ఆయా ఉపాధ్యాయులకు మరో అవకాశం కల్పించారని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా ఫామ్–19 సమర్పించేందుకు ఈనెల 9నుంచి తమ ధ్రువీకరణ పత్రాలతో ఓటరుగా దరఖాస్తులు చేసుకోవచ్చునని తెలిపారు.

నిట్‌లో జియాన్ సదస్సు ప్రారంభం


సదస్సును ప్రారంభిస్తున్న నిట్ డైరెక్టర్

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లోని సివిల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 'ఎకో హైడ్రోలాజికల్ మోడలింగ్' అంశంపై ఏర్పాటు చేసిన ఐదు రోజుల జియాన్ సదస్సును నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ బుధవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సివిల్ ఇంజనీరింగ్ రంగంలో నూతన పరిశోధనలకు సదస్సు వేదికగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు వంశీకృష్ణ, ఇంద్రజిత్ తదితరులు పాల్గొన్నారు.

లారీ, ఆర్టీసీ బస్సు ఢీ..

- 33 మంది ప్రయాణికులకు గాయాలు
- జలగలంచ బ్రిడ్జి వద్ద ఘటన


చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు


ఎస్ఎస్‌తాడ్వాయి: తాడ్వాయి– పస్రా మధ్యలోని లవ్వాల స్టేజీ సమీపంలోని జలగలంచ బ్రిడ్జి వద్ద లారీ, ఆర్టీసీ బస్సు ఢీకొన్నాయి. ఈ ఘటన బుధవారం సాయంత్రం చోటు చేసుకోగా బస్సులోని 33 మంది ప్రయాణికులు గాయపడ్డారు. తృటిలో భారీ ప్రాణపాయం తప్పింది. ఘటన వివరాల ఇలా ఉన్నాయి. ఆర్టీసీ బస్సు మంగపేట నుంచి హనుమకొండకు వెళ్తోంది. లారీ హనుమకొండ వైపు నుంచి ఏటూరునాగారం వైపునకు ఇసుక లోడింగ్ కోసం వెళ్తోంది. ఈ క్రమంలో జలగలంచ బ్రిడ్జి వద్ద రెండు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో బస్సులోని 33 మంది ప్రయాణికులు గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే తాడ్వాయి పోలీసులు ములుగు సివిల్ ఆస్పత్రికి తరలించారు. ఊకే నాగమణి, వంగరపూరి నానాజీ, రాంచక్కర్‌రావు, వెంకటర్‌రెడ్డి, శ్వేత, మోక్ష, పానుగంటి శేఖర్, భాగ్యలక్ష్మి, అరుణ, మెడిగ భాగ్యలక్ష్మి, రజని, ఎర్రగుంట నరేశ్, రావుల శారద, జర్పుల అరుణకుమారి, పరికరాల రజిని, రుద్రరాపు విజయ, తాటి అమల, కృష్ణయ్య, నీల, విజేందర్, రామచందర్, షకీల్, లావణ్య, మాధవి, శామ్య, కల్యాణి, సులోచన, సమ్మయ్య, హరికృష్ణ గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన నలుగురిని మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం తరలించారు. ఆర్టీసీ డ్రైవర్ కూడా గాయపడ్డారు. వరంగల్–2 డిపో డీఎం జోత్స్న, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవీందర్ ఆస్పత్రికి చేరుకుని క్షతగాత్రులు, డ్రైవర్‌ను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

వాహనాల మళ్లింపు..

జలగలంచ బ్రిడ్జి వద్ద లారీ, ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, సిబ్బందితో కలిసి వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. ఏటూరునాగారం నుంచి హనుమకొండ వైపునకు వెళ్లే వాహనాలను తాడ్వాయి నుంచి మేడారం మీదుగా, హనుమకొండ నుంచి వచ్చే వాహనాలను పస్రా నుంచి నార్లాపూర్ మీదుగా తాడ్వాయికి మళ్లించారు.

చిన్నారి అపహరణకు యత్నం

- అయోధ్యపురంలో ఘటన


అంగన్‌వాడీ కేంద్రం ఎదుట ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు

గూడూరు: మండలంలోని అయోధ్యపురంలో మంగళవారం ఓ చిన్నారి అపహరణకు యత్నం జరగగా, గుర్తించిన గ్రామస్తుడు ఆ చిన్నారిని ఆ వ్యక్తి నుంచి తీసుకుని తల్లిదండ్రులకు అప్పగించాడు. అంగన్‌వాడీ కేంద్రం వద్ద తల్లిదండ్రుల ఆందోళనతో ఈ విషయం బుధవారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన పర్వతోజు వంశీ, శృతి దంపతుల కూతురు శ్రీకృతిని రోజుమాదిరి మంగళవారం అంగన్‌వాడీ కేంద్రానికి పంపించి వెళ్లారు. కొద్ది సేపటి తరువాత చిన్నారి సెంటర్ నుంచి రోడ్డుపైకి రాగా, అంగన్‌వాడీ టీచర్ గుర్తించలేదు. అదే సమయంలో సైకిల్‌పై వచ్చిన ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆ చిన్నారిని తీసుకుని వెళ్తున్నాడు. గుర్తించిన గ్రామస్తుడు అన్వర్ వెంటనే సైకిల్‌ను ఆపాడు. ఎవరు నీవు.. పాపను ఎక్కడికి తీసుకెళ్తున్నావని ప్రశ్నించి పాపను అతడి వద్ద నుంచి తీసుకున్నాడు. భయపడిన ఆ వ్యక్తి వెంటనే సైకిల్‌పై పరాయయ్యాడు. అన్వర్ ఆ చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించి విషయం తెలిపి వెళ్లాడు. తల్లిదండ్రులు అంగన్‌వాడీ టీచర్ విజయను అడగ్గా, తనకేమీ తెలియదని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చింది. దీంతో తల్లిదండ్రులు కేంద్రం వద్ద ఆందోళన వ్యక్తం చేయగా, ఓ నాయకుడు ఈ విషయాన్ని సీడీపీఓకు తెలిపారు. మొత్తానికి చిన్నారి అపహరణకు యత్నించిన వ్యక్తి ఎవరు అనే అంశం ప్రశ్నార్థకంగా మారింది.